రక్తదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులచే రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల నిండు ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మంచిదని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

రోడ్లు జలమయం



కూకట్‌పల్లి: కైత్లాపూర్ ఫ్లై ఓవర్ పరిసరాలు సోమవారం కురిసిన వర్షానికి జలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కైత్లాపూర్ ప్రాంతీయులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉమామహేశ్వరాలయం పక్కన చెత్తను పోస్తూ ఆ ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చారు. అధికారులు ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

మోతీనగర్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఎన్. రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు నలమాల్పు అంజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

వైద్యులు దైవంతో సమానం



వైద్యురాలికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



రాందేవ్‌రావ్ ఆసుపత్రి వైద్యులను సన్మానిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- డాక్టర్స్ డే సందర్భంగా పలువురికి సన్మానం

కూకట్‌పల్లి: వైద్యులు దైవంతో సమానమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన వైద్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వైద్యులకు ఉండే గౌరవం ఎప్పటికీ మొదటి స్థానంలోనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శోభరాజ్, డా. మౌనిక, డా. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో..

జాతీయ వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు నాయకులు రాందేవ్‌రావ్ ఆసుపత్రిలోని వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ రేకీ థెరపిస్ట్ గ్రాండ్ మాస్టర్ లక్ష్మీ కమలాకర్, మెడికల్ డైరెక్టర్ కమలాకర్, ప్రముఖ స్త్రీ నిపుణురాలు ఛాయాదేవి, సీఈఓ డాక్టర్ యోబు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్కృతి ప్రెసిడెంట్ లయన్ సుష్మ, సుజాత, సూర్యారాజు, ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ అరిగెల రఘునాథ్ బాబు, జగన్ ఎర్రవెల్లి, పెరిప్రసాద్, తెల్ల హరికృష్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల సీజ్

సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఓ విద్యార్థిపై స్కూలు బస్సు వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డుపై ఒక్కసారిగా ఆగిపోవటంతో ప్రమాదం జరగకపోవటంతో స్థానికులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో ఆగిపోయిన ఓ స్కూల్ బస్సును విద్యార్థులు నెట్టుతుండటం, అదే ప్రాంతంలో ప్రమాదం జరగటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో 'ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రమాదం' అనే శీర్షికతో 'సాక్షి'లో జూన్ 29న ప్రచురితమైన కథనానికి ఆర్‌టీఏ అధికారి శ్రీనుబాబు, ఆయన బృందం మంగళవారం కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లోని మాప్‌లెస్, భాష్యం, వాసర, స్వాతి తదితర స్కూళ్ల బస్సులను తనిఖీలు చేసి సీజ్ చేశారు. ఫిట్‌నెస్, సర్టిఫికెట్, పర్మిట్, టాక్స్ కట్టని బస్సులను సైతం సీజ్ చేసినట్లు తెలిపారు.



పలు ప్రాంతాల్లో ఆర్‌టీఏ అధికారులు సీజ్ చేసిన స్కూల్ బస్సులు

రేపటి నుంచి లలితా పరమేశ్వరి దేవి శాకాంబరి మహోత్సవాలు

మోతీనగర్: మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ అవంతినగర్‌లోని శివరామాంజనేయ దేవాలయంలో గురువారం నుంచి ఆదివారం వరకు లలితా పరమేశ్వరి దేవి శాకాంబరి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, సాయంత్రం 6 గంటలకు లలిత సహస్ర నామ పూర్వక కుంకుమార్చన, శనివారం ఉదయం విశేష శాకాంబరి దేవి అలంకారం, కాయగూరలు, పూలు, పండ్లతో అలంకారం, 10 గంటలకు విశేష లలితా సహస్ర నామ పారాయణం, సాయంత్రం 6 గంటలకు శరణాగతి ఉత్సవం, ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శాకాంబరి అమ్మవారి ప్రసాదంగా అన్న ప్రసాద వినియోగం జరుగునని తెలిపారు.

ప్రతి ప్రాణం వెనుక ఓ వైద్యుడి సేవ

మేడ్చల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ

సాక్షి,సిటీబ్యూరో: ప్రతి ప్రాణం వెనుక ఓ వైద్యుని సేవ ఉంటుందని, వారి నిస్వార్థ కృషికి మనం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరీ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల్లో సేవలందిస్తున్న వైద్యుల కృషి అసామాన్యమన్నారు. వారి సానుభూతితో కూడిన నిబద్ధత వల్లనే మేడ్చల్ జిల్లాలో ఆరోగ్య రంగం ప్రజలకు మరింత దగ్గరైందన్నారు. కొవిడ్ వంటి విపత్కర కాలంలో వారు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, అలాంటి సమయంలో వారు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన తీరు ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలిచిందన్నారు. డా. బీసీ రాయ్ చూపిన సేవా మార్గం వైద్యులకి ఆదర్శమన్నారు. అటువంటి ఆచార్యుల వారసులుగా ప్రతి వైద్యుడు సేవలందించడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు డా. శోభారాణి, డా. సత్యవతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, డా. శ్రీదేవి, డా. మల్లేశ్వరి, డా. గీతా, డా. చంద్రకళా, డా. కౌశిక్, డా. వినోద్ గారు, ఆరోగ్య సిబ్బంది, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు పూర్తి



బాలానగర్: ప్రభుత్వ పాఠశాలలో 3 నుంచి 9వ తరగతి విద్యార్థులకు బేస్‌లైన్ టెస్టులు నిర్వహించారు. గత నెల 25 నుంచి 20వ తేదీ వరకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరానికి మూడు సార్లు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. చదవటం, రాయటం ఎంత మందికి వస్తుంది? సైన్స్, లెక్కలు సబ్జెక్టుల్లో ఎలా ఉన్నారు, ఒక లెక్క ఇస్తే చదివి లెక్క చేయగలుగుతున్నారా? లేదా? అనేది తెలుస్తుంది. ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరిలుగా విభజిస్తారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన ఉంటుంది. కరోనా తరువాత విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు తొలి మెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసెంబర్‌లో మిడ్‌లైన్, మార్చి నెలలో ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలపై వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు. జూన్ నెలలో నిర్వహించిన టెస్ట్‌లో సీ గ్రేడ్ వచ్చిన విద్యార్థులను మార్చి నాటికి ఏ, బీ గ్రేడ్‌లలో వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి. విద్యార్థుల స్థాయిని బట్టి ఉపాధ్యాయులు వారికి పాఠాలు బోధించాలి. బేస్‌లైన్ పరీక్ష ఫలితాలు త్వరలో రానున్నాయి.

నల్ల చెరువు పనుల పరిశీలన



చెరువు పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువులో కోట్ల రూపాయలతో ప్రభుత్వం ఇటీవల సుందరీకరణ పనులను చేపట్టింది. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ నల్ల చెరువు ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. నల్ల చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 33 ఎకరాలు ఉన్న ఈ చెరువు ప్రస్తుతం చాలా వరకు కబ్జాకు గురైందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చెరువును కాపాడాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరికైనా డాక్యుమెంట్స్ ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

బాలకార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన

సాక్షి,సిటీబ్యూరో: ఆపరేషన్ ముస్కాన్-11లో భాగంగా బాల కార్మికులు లేని మేడ్చల్ జిల్లాగా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ హాల్‌లో 'ఆపరేషన్ ముస్కాన్-11' సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో బాలకార్మికులుగా పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా బాలల కమిషన్ సభ్యురాలు సరిత తెలిపారు.

పిల్లల భవిష్యత్ అందరి బాధ్యత

పిల్లల ముఖాల్లో చిరునవ్వులే కాకుండా వారికి బంగారు భవిష్యత్‌ను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో బాల కార్మికులు పనిచేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. జిల్లాలో 10 సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని, వాటి వివరాలు మిషన్ వాత్సల్య పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.